షాడో మేయర్‌కు కాంగ్రెస్‌లో చోటు కల్పించొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న నిజాంపేట్ కాంగ్రెస్ నాయకుడు రామచందర్‌నాయక్

నిజాంపేట్: షాడో మేయర్ తన ఆస్తులను కాపాడుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చారని.. తన భార్య అధికారాన్ని అడ్డం పెట్టుకుని కబ్జాలకు పాల్పడుతున్నారని నిజాంపేట్ కాంగ్రెస్ నాయకుడు రామచందర్ నాయక్ అన్నారు. బుధవారం నిజాంపేట్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో షాడో మేయర్‌కు కాంగ్రెస్ పార్టీలో చోటు కల్పించకూడదని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రామచందర్ నాయక్ మాట్లాడుతూ.. భూకబ్జాలతో ప్రజలు ఆస్తులు దోచుకునే షాడో మేయర్ వస్తే కాంగ్రెస్ పార్టీకే మాయని మచ్చగా మారుతుందన్నారు. ప్రజలకు సేవ చేయడానికి కాకుండా తమ ఆస్తులను కాపాడుకోవడానికి తహతహ లాడుతున్నారని ఆరోపించారు. పార్టీ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు.

మహనీయుల విగ్రహాలకు రంగులు వేయాలి


కమిషనర్ రామకృష్ణరావుకు వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

నిజాంపేట్: మహనీయుల విగ్రహాలకు రంగులు వేయాలని బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ దళిత సంఘాల చైర్మన్ మేకల నగేష్ ఆధ్వర్యంలో కమిషనర్ రామకృష్ణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 5, బాబూజగ్జీవన్‌రామ్, 11న జ్యోతిరామ్‌పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతి ఉత్సవాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో పలు బస్తీలు, కాలనీల్లోని ఉన్న మహనీయుల విగ్రహాలను శుభ్రం చేయించి పెయింటింగ్‌లు వేయించాలని వినతిలో కోరారు. నిజాంపేట్ 20వ వార్డు డివిజన్ కార్పొరేటర్ బాలాజీ నాయక్, బాలపీరు, చంద్రయ్య, యాదగిరి, రాములు, సారయ్యలు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం


ఆదర్శనగర్ కమ్యూనిటీహాల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రంగారెడ్డినగర్: పేదప్రజల నివాసిత ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఆదర్శనగర్ హౌసింగ్, బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ కమ్యూనిటీహాల్‌లో ముత్తూట్ ఫైనాన్స్ ఆరోగ్య సంచారిణి, ఎం.జార్జ్ ఫౌండేషన్ సంస్థ నేతృత్వంలో ఆదర్శనగర్ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శంకరయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో 150 మందికి కిడ్నీ వ్యాధులు, గుండె, లివర్ సంబంధిత వ్యాధులు, బీపీ, డయాబెటీస్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నాంచారమ్మ, ఎం.దుర్గ, నాగభూషణం, ఆంజనేయులు, నాగదేశి రవికుమార్, చంద్రశేఖర్, నారాయణగౌడ్, కోటేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ జయరామ్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి, శ్రీకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నవగ్రహ ప్రతిష్ఠ, హోమాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల మహిళా మండలి అధ్యక్షురాలు కృష్ణవేణి, సతీష్, కవిత, శివకుమార్, రవిగౌడ్, హర్షిత, రామలక్ష్మి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైతుబంధు నిధులు ఎక్కడికెళ్లాయో చెప్పాలి'

పంజగుట్ట: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు వేసేందుకు సిద్ధం చేసుకున్న ఏడు వేల కోట్ల రూపాయలను ఎన్నికల కమిషన్ ఆపిందని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ ఏడు వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన బక్కా జడ్సన్ ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి రాగానే ధరణి తీసేస్తాము అని ప్రకటించారని కానీ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ధరణి తొలగించకపోగా అసలైన దొంగ ఓ ఐఏఎస్ అధికారిని అలాగే ఉంచుకున్నారని ఆరోపించారు. నన్ను సస్పెండ్ చెయ్యడం కాదు ప్రజలు నిన్నే సస్పెండ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

లిబర్టీ: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధన పేరుతో జయంతి ఉత్సవాలు జరపకుండా దళిత బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకూడదని ఆయన విన్నవించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5వ తేదీన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, ఏప్రిల్ 14వ తేదీన భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గుర్తు చేశారు.

ముగిసిన 'ఎన్నికల శిక్షణ'

బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్ డిగ్రీ కాలేజీలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో 800 మంది అధికారులు పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోలింగ్ యూనిట్ పని చేసే విధానంతో పాటు ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు స్పందించాల్సిన తీరును ప్రత్యేక ట్రైనర్లు వారికి వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలను వెల్లడించారు. పొరపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను ముగించే విధానాన్ని పీపీటీ ద్వారా వివరించారు.

ఆర్‌ఎంపీ ముసుగులో వైద్యం!

- నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మూడు క్లినిక్‌లు సీజ్
- కఠిన చర్యలు తప్పవంటున్న జిల్లా వైద్యాధికారి డా.టి.రఘునాథస్వామి

క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా వైద్యాధికారులు


ఆర్‌ఆర్ క్లినిక్ యాజమానికి నోటీసులు అందజేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథస్వామి

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన సిఫార్సు ఆధారంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథస్వామి, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ ఆనంద్ బృందంతో కలసి అర్హతలేని వైద్యులు నడుపుతున్న పాలీ క్లినిక్‌లు, నమోదు కాని ఆస్పత్రులపై కొరడా ఝులిపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారులు ఆర్‌ఆర్ శ్రీజన్ క్లినిక్, శ్రీ వీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, పూర్ణ ల్యాబ్‌లను సీజ్ చేశారు.

- తనిఖీల్లో భాగంగా క్లినిక్, ల్యాబ్‌లో శస్త్రచికిత్స కత్తెరలు, ప్రొసీడ్యూరల్ మెటీరియల్స్, ఏపిడ్యూరల్ స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, ఎక్స్పైరీ మందులు లభించాయి. నిబంధనల ప్రకారం క్లినిక్‌లలో శస్త్రచికిత్సకు సంబంధించిన పరికరాల అవసరం ఉండదు. కానీ ఈ క్లినిక్‌లలో ఇవి లభ్యం కావడంతో అధికారులు కేసులు నమోదు చేశారు.
- అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ యాజమాన్యం ఆస్పత్రిని నడుపుతోందని అధికారులు తెలిపారు. ఈ క్లినిక్‌లు చట్టవిరుద్ధంగా అర్హత లేని వైద్యులతో చిన్న శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాయి. అనుమతి లేకుండా వైద్య నిపుణులుగా ప్రాక్టీస్ చేసి ప్రచారం చేసుకుంటున్నట్లు కూడా గమనించారు.
- డీఎంహెచ్‌ఓ బృందం, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారుల సమక్షంలో ప్రజారోగ్యానికి శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్స్-రెగ్యులేషన్) యాక్ట్ 2010 (కేంద్ర చట్టం నెం 23/ 2010)- రూల్స్ 2022 ప్రకారం క్లినిక్‌లను సీజ్ చేశారు.
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన ఆస్పత్రి యాజమాన్యాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ నవనీత, షాపూర్‌నగర్, అంజన్న డెమో, ఎంపీహెచ్‌ఏ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, ఏఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

అర్హత లేకుండా వైద్యం చేయొద్దు..



అర్హత లేకుండా ఎవరు వైద్యం చేయకూడదు. సూచిక బోర్డుపై క్లినిక్, మెడికల్ సెంటర్, నర్సింగ్ హోమ్ పేర్లు పెడితే కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే ఆర్‌ఎంపీ ముసుగులో వైద్యం చేస్తున్న పలు క్లినిక్‌లను జిల్లాలో సీజ్ చేశాం. మున్ముందు మరిన్ని సీజ్ చేస్తాం.

– డాక్టర్ టి.రఘునాథస్వామి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి

కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పూల్‌సింగ్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ అనారోగ్య కారణంగా సెలవు పెట్టారు. దీంతో ఆయన స్థానంలో 15 రోజుల పాటు బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

స్థానిక సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి



కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి శుభకార్యాలకు రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అదే విధంగా పలువురు స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరగా రాజు సానుకూలంగా స్పందించారు.

వృద్ధురాలి అదృశ్యం


జయమని (ఫైల్)

జీడిమెట్ల: ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయిన వృద్ధురాలు తప్పిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన రాజ్‌పుత్ జయమని(75) గత నెల 6వ తేదీన షాపూర్‌నగర్ కళావతినగర్‌లో ఉండే కుమార్తె స్వరూప వద్దకు వచ్చింది. అదేనెల 15వ తేదీన జయమని కుమార్తె స్వరూప ఇంట్లో వంట చేస్తుండగా చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కొద్ది సేపటి తర్వాత తల్లి కనిపించకపోవడంతో కుమార్తె స్వరూప చుట్టు పక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాల్కాజ్‌గిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి


కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపించాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జాతీయ పార్టీలు సొంత ప్రయోజనాలే అజెండాగా పని చేస్తాయని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేస్తాయన్నారు. తెలంగాణాలో బీఆర్‌ఎస్ అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలిస్తేనే స్థానిక అభివృద్ధికి నిధులు వస్తాయని అన్నారు. దీనిని గుర్తెరిగి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు వీలుకాని హామీలతో అధికారం చేపట్టిందన్నారు. ఆ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి కుత్బుల్లాపూర్ సమస్యలపై ఏమి అవగాహన ఉందని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పట్టించుకుని పరిష్కరించే నాయకుడినే వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

- ఆర్టీసీ కార్గో ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు
- ఈనెల 17వ తేదీ వరకు బుక్ చేసుకోవడానికి అవకాశం

రాయదుర్గం: భద్రాచలం సీతారాముల తలంబ్రాలను ప్రజలకు అందించేందుకు ఆర్టీసీ కార్గో ద్వారా ఏర్పాట్లు చేసినట్లు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవల లాజిస్టిక్ కౌంటర్ల ద్వారా ఇంటింటికి పంపించే ఏర్పాట్లు చేసినట్లు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ సహకారంతో సీతారాముల తలంబ్రాలు హోమ్ డెలివరీ చేసే కార్యక్రమాన్ని టీఎస్ ఆర్టీసీ శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు. ఈనెల 17వ తేదీ వరకు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్లలో రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు.. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పట్లోళ్ళ విజేందర్‌రెడ్డి 9652267204, 9849567204లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎలక్టోరల్ బాండ్స్ దేశంలోనే అతిపెద్ద కుంభకోణం

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

లిబర్టీ: ఎలక్టోరల్ బాండ్స్ కుంభకోణం దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బుర్ర రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్‌యమునగౌడ్, అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, దివ్యంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు విజయ్ ముల్లంగి, నేతలు కోడంగల్ శ్రీనివాస్, శివాజీ, మౌనికలతో కలిసి డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడారు. ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లకు బీజేపీ పేటెంట్ ఇచ్చి కార్పొరేట్ కంపెనీలపై దాడులు చేయించి, భయభ్రాంతులకు గురి చేసి, కొంత మంది కార్పొరేట్ కంపెనీల యాజమానులపై కేసులు పెట్టి అరెస్టులు చేయించిందన్నారు. వీటి నుంచి తప్పించుకోవడానికి ఈ కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి వేలాది కోట్లు బీజేపీకి కట్టబెట్టాయని ఆరోపించారు. బీజేపీ ఓటమి భయంతోనే ఎన్నికల ముందు ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఏ పాత్రలేని అరవింద్ కేజ్రీవాల్‌ను జైలులో ఇరికించిందని, ఇంకా చాలా మంది విపక్ష నేతలను ఇరికించే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుందని, దేశ ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు.

డీఈవో, ఎంఈవోలకు సత్కారం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం నూతన ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన వసంతకుమారి, జిల్లా డీఈవో విజయకుమారి బుధవారం బాలానగర్‌లోని ఎన్‌ఎస్‌కే స్కూల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, చైర్మన్ పి.శివయ్య, వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ప్రెసిడెంట్ వరప్రసాద్, నందారెడ్డి, ఆర్‌ఎస్ చారి, రఘు కుమార్, సాధన రాజులు, శశిరేఖ, వెంకటేశ్వర్లు, రాజేష్ కుమార్ పాల్గొన్నారు.


డీఈవో, ఎంఈవోలను సత్కరిస్తున్న ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ యాజమాన్య అసోసియేషన్ సభ్యులు

ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ల కేటాయింపు

పార్టీ ప్రతినిధుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా మొదటి దశ ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాడ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజక వర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియతో కలసి ఆయన ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాలలోని 2,425 పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించామన్నారు. జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో 591 పోలింగ్ కేంద్రాలకు 738 కంట్రోల్ యూనిట్లు, 738 బ్యాలెట్ యూనిట్లు, 827 వీవీ ప్యాట్‌లను కేటాయించగా, మల్కాజిగిరి నియోజకవర్గానికి 418 పోలింగ్ కేంద్రాలకు 522 కంట్రోల్ యూనిట్‌లు, 522బ్యాలెట్ యూనిట్లు, 585 వీవీప్యాట్‌లను, కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో 417 పోలింగ్ కేంద్రాలకు 521 కంట్రోల్ యూనిట్లు, 521 బ్యాలెట్ యూనిట్లు, 583 వీవీప్యాట్‌లు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 592 పోలింగ్ కేంద్రాలకు గానూ 740 కంట్రోల్ యూనిట్లు, 740 బ్యాలెట్ యూనిట్లు, 828 వీవీ ప్యాట్‌లు, ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని 407 పోలింగ్ కేంద్రాలకుగానూ 508 కంట్రోల్ యూనిట్లు, 508 బ్యాలెట్ యూనిట్లు, 569 వీవీ ప్యాట్‌లు కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 3,029 కంట్రోల్ యూనిట్లు, 3,029 బ్యాలెట్ యూనిట్లు, 3,393 వీవీప్యాట్‌లను కేటాయించామన్నారు. మొదటి ర్యాండమైజేషన్‌కు సంబంధించిన హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామని ఆయన తెలిపారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

385 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

జారీ చేసిన డీఈఓ విజయకుమారి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పదోతరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనానికి రిపోర్ట్ చేయని ఉపాధ్యాయులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎస్ఎస్‌సీ పరీక్షా పత్రాల మూల్యాంకనానికి సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ ఎన్ఎస్‌కేకే పాఠశాలలో క్యాంపు నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఎస్ఎస్‌సీ మూల్యాంకనానికి సంబంధించిన క్యాంపులో రిపోర్ట్ చేయాల్సిన 385 మంది ఉపాధ్యాయులు హాజరు కాలేదు. ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తంచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఆర్డర్లు తీసుకుని రిపోర్ట్ చేయని వారికి షోకాజ్ నోటిసులు జారీ చేశారు. గురువారం ఉదయం 9 గంటల వరకు ఆర్డర్లు పొందిన ఉపాధ్యాయులు రాకపోతే సీసీఏ రూల్స్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించండి

సాక్షి, మేడ్చల్‌జిల్లా : గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్,చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులకు నెలనెలా సక్రమంగా జీతాలు అందజేయకపోవటంతో వారి కుటుంబాలు అర్ధాకలితో జీవనాన్ని సాగించాల్సి పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో 61 గ్రామ పంచాతీలు ఉండగా, అత్యధిక వాటిల్లో కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. జిల్లాలోని లక్ష్మాపూర్,నాగౌట్టిపల్లి,గోధుమకుంట, బండమదారం , శ్రీరంగవరం, కోనాయ్‌పల్లి, నూతనకల్, లింగాపూర్‌తండ, అలియాబాద్,మజీద్‌పూర్,ఎదులాబాద్, అంకుశాపూర్ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు 4 నెలలుగా వేతనాలు అందటం లేదని తెలిపారు.

'మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువు నష్టం దావా వేశా'

మేడ్చల్: మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి తన యూనివర్శిటీ పేరుతో ఎన్నో భూకబ్జాలకు పాల్పడి ప్రజలకు ఉపయోగపడాల్సిన కుంటను మాయం చేశాడని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్ ఆరోపించాడు. గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైసమ్మగూడలో ఉన్న కుంటను పూర్తిగా కబ్జాలు చేసి తన యునివర్సిటీలో కొంతస్థలం కలుపుకున్నాడని అన్నారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, నాటి సీఎం కేసీఆర్ మెప్పు పొందడానికి మూడు దఫాల్లో 32వేల మొక్కలు నాటి వాటిని ప్రస్తుతం పూర్తిగా తొలగించి భవనాలు నిర్మించారని అన్నారు. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో హరితహరం కోసం వేల రూపాయాలు ఖర్చు చేయించి వేల మొక్కలు నాటించి వాటిని పూర్తిగా తొలగించారని అన్నారు.తనపై ఆయన ఇష్టానుసారంగా మాట్లాడారని తన వ్యక్తిగత ప్రతిష్ట దిగజారేవిధంగా మాట్లాడారని ఆయనపై 20కోట్ల పరువు నష్టం దావా వేసినట్లు ఈశ్వర్ తెలిపారు.

వ్యాసరచన పోటీలు

జిన్నారం(పటాన్‌చెరు): ఎర్త్‌డే సందర్భంగా ఆరు నుంచి 12వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు స్కోప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఉప్పలయ్య తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలను ఉప్పలయ్య వెల్లడించారు. ఈనెల 22న ఎర్త్ డే సందర్భంగా విద్యార్థులకు 'భూమండలాన్ని ప్లాస్టిక్ రహితం చేసేందుకు ఏం చేయాలి' (ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్)అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తమ వ్యాసానికి నగదు బహుమతి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్: 9849455481లో సంప్రదించాలని సూచించారు.

'డీఈటీ' శిక్షణకు హైదరాబాదే అగ్రగామి

లక్డీకాపూల్: అంతర్జాతీయ విద్యా అవకాశాల కోసం ముఖ్యంగా యూఎస్ ఉన్నతకు డ్యుయోలింగ్ ఇంగ్లిష్ టెస్ట్(డీఈటీ) రాసే వారిలో దేశంలోనే హైదరాబాద్ అగ్రశ్రేణి నగరంగా నిలుస్తుందని డ్యుయోలింగో ఇంగ్లిష్ టెస్ట్ మార్కెట్ లీడర్(ఇండియా) తారా కపూర్ తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... డీఈటీ పరీక్ష రాసే మొదటి 25 నగరాల్లో ఏడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్నాయన్నారు. వరంగల్, నెల్లూరు, ఖమ్మం ఈ జాబితాలో ఉన్నాయని చెప్పారు. ఉన్నత విద్య డైనమిక్ ల్యాండ్ స్కేప్‌లో ప్రావీణ్యత పరీక్ష తప్పనిసరన్నారు. ఇంగ్లిష్ అభ్యాసకులకు ఉన్నత విద్యలో ఉన్న అడ్డంకులను డ్యుయోలింగో ఇంగ్లిష్ టెస్ట్ తగ్గిస్తుందన్నారు.

స్వల్ప అగ్ని ప్రమాదం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని ఫిలింఛాంబర్ ఆవరణలో ఉన్న స్వరుచి కిచెన్ వద్ద బుధవారం సాయంత్రం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది,. దీంతో సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫిలింఛాంబర్ కింద ఉన్న స్వరుచి రెస్టారెంట్ కిచెన్ నుంచి ఈ మంటలు వ్యాపించినట్లు ఫైర్ అధికారులు తెలిపారు. మంటలు పైన ఉన్న అంతస్తులకు వ్యాపించకుండా ఫైర్ స్టేషన్ అధికారులు స్పందించడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫీజు గడువును పొడిగించాలి

హిమాయత్‌నగర్: ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షా ఫీజు గడువును పొడిగించాలని, పెంచిన డిగ్రీ విద్యార్థుల పరీక్ష ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ... ఇప్పటికే విద్యార్థులు ఆర్థికంగా నష్టపోయారని, ఇప్పుడు పరీక్ష ఫీజులను సైతం పెంపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫీజు గడువును పెంచాలని, పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని, అపరాధ రుసుము లేకుండా ఫీజులు చెల్లించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

సైబర్ మోసాలపై అవగాహన

హిమాయత్‌నగర్: సైబర్ క్రైమ్స్, సోషల్ మీడియా మోసాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. బుధవారం సైబర్ క్రైమ్ సీఐ కే.సైదులు ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్‌లోని పలు హాస్టళ్ల వద్ద విద్యార్థులు, యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఓటీపీ, డెబిట్, క్రెడిట్, పెట్టుబడి, పార్ట్ టైమ్ జాబ్స్, ఫెడెక్స్, సోషల్ మీడియా తదితర మోసాలు పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అధిక లాభాలకు ఆశపడి వ్యాపారం, పెట్టుబడి, పార్ట్‌టైమ్ ఉద్యోగాల్నుపై సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో వచ్చే సందేశాలు, లింక్‌లు ఓపెన్ చేసి వాటి ద్వారా డబ్బు పెట్టుబడి పెట్టవద్దని సూచించారు.